క్లుప్తంగా

'ముక్కా'కు విశిష్ట ఇష్టపది చక్రవర్తి పురస్కారం



పెనుగంచిప్రోలు:స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు, రచయిత ముక్కా సత్యనారాయణను మరో బిరుదు పురస్కారం లభించింది. ఇష్టపది ప్రక్రియలో సహస్ర అధిక రచనలు చేసినందుకుగాను కరీంనగర్‌కు చెందిన మహతి సాహితీ కవిసంగమం వారు ఆయనకు వారు ఈబిరుదు ప్రదానపత్రం అందజేశారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తనకు ఇప్పటికే పలు రచనలకు గాను 30 బిరుదు పురస్కారాలు, 900 వరకు ప్రశంసా పత్రాలు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

10న మండల పరిషత్ సమావేశం

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల పదోతేదీ ఉదయం 10గంటలకు మండల పరిషత్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరుకావాలని కోరారు. సమావేశానికి అన్ని మండలశాఖ అధికారులు నివేదికలతో సహా తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

వ్యక్తికి తీవ్రగాయాలు



కంచికచర్ల : ఎదురుగా వస్తున్న కంటైనర్ బైక్‌ను ఢీకొనడంతో ఓవ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన వీరభద్రం అనేవ్యక్తి బైక్‌పై పరిటాల వైపు నుంచి జుజ్జూరుకు వస్తుండగా ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీ ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని నేషనల్ హైవే అంబులెన్స్ వాహనసిబ్బంది చికిత్స నిమిత్తం విజయవాడలోని ఓప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

అప్రకటిత విద్యుత్ కోతతో అవస్థలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో వారంరోజులుగా అప్రకటిత విద్యుత్ కోత విధిస్తుండటంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు విద్యుత్ కోత విధిస్తారో..ఎప్పుడు తిరిగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారో తెలియని పరిస్థితి ఏర్పడిందని పట్టణప్రజలు చెబుతున్నారు. ముఖ్యంగా పగలు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్య తరచూ విద్యుత్ కోతలు విధిస్తుండగా, పగటిపూట నాలుగు గంటలకు మించి కూడా విద్యుత్ సరఫరా ఉండటం లేదు. ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి విద్యుత్‌కోతలు లేకుండా చూడాలని జగ్గయ్యపేట పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నందిగామలో భారీ వర్షం

నందిగామ టౌన్:పట్టణంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు భానుడు విజృంభించినప్పటికీ ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై గాలులతో కూడిన వర్షం కురిసింది. వారం రోజులుగా వేసవి రోజులను తలపించేలా ఎండ, ఉక్కపోతతో ఒకింత ఇబ్బంది పడగా, సాయంత్రం సమయంలో పడిన వర్షంతో ప్రజలు ఒకింత సేద తీరారు. ఇప్పటికే వర్షాలు, వరదలకు పంటలు నష్టపోయిన అవస్థలు పడుతున్నామని మళ్లీ వర్షాలు కురిస్తే, అరకొరగా ఉన్న పంటలు కూడా దక్కవని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మండపాల వద్ద ప్రత్యేక పూజలు

కంచికచర్ల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కంచికచర్లలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. పశువుల ఆసుపత్రి రోడ్డు, ఫైర్‌స్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకారం చేసి భక్తులు పూజలు చేశారు.

సమీకృత హాస్టల్‌లో వసతులు నిల్

- తలుపులు లేని స్నానాల గదులు, టాయిలెట్లు
- ప్రహరీ లేకపోవడంతో రక్షణ కరువు
- మరమ్మతులకు గురైన సోలార్ సిస్టమ్
- సమస్యలతో సమీకృత హాస్టల్ బాలికలు సతమతం



జగ్గయ్యపేట ప్రభుత్వ సమీకృత బాలికల హాస్టల్ భవనం



చిట్టడవిని తలపిస్తున్న హాస్టల్ పరిసరాలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని సమీకృత (ఇంటిగ్రిటీ) హాస్టల్‌లో సరైన సదుపాయాలు లేకపోవడంతో ఇక్కడ ఉంటున్న విద్యార్థినులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలు గదులు, టాయిలెట్లకు తలుపులు కూడా లేకపోవడంతో విద్యార్థినులు భయాందోళనలకు గురవుతున్నారు.

విద్యార్థినులకు భద్రత కరువు..

జగ్గయ్యపేటలోని జెడ్పీ బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో 2011లో సమీకృత బాలికల హాస్టల్‌ను ఏర్పాటుచేశారు. గతంలో మండలానికి ఓ హాస్టల్ ఉండగా అన్నింటినీ ఒకచోట చేర్చి సమీకృత హాస్టల్‌గా ఏర్పాటు చేశారు. ఈ హాస్టల్‌లో మూడు నుంచి పదోతరగతి వరకు చదువుతున్న 243మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ విభాగాలకు చెందిన బాలికలు ఉంటున్నారు. గతంలో 400మంది విద్యార్థులు ఉండగా, ముగ్గురు వార్డెన్లు ఉండేవారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఓ వార్డెన్ మాత్రమే ఉన్నారు. హాస్టల్‌లో ఉండే విద్యార్థినుల్లో అత్యధికులు పక్కనే ఉన్న జెడ్పీ బాలుర హైస్కూల్‌లో చదువుతుండగా, మిగిలినవారు జెడ్పీ బాలికల హైస్కూల్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అయిన సెంటర్ స్కూల్‌లో చదువుతున్నారు. హాస్టల్ చుట్టూ ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినులకు రక్షణ కరువైంది. హాస్టల్‌భవనాల చుట్టూతా కంపచెట్లు భారీగా పెరిగి ఉండటంతో రాత్రివేళల్లో తేళ్లు, పాముల భయం విద్యార్థినులను వెంటాడుతోంది. ప్రహరీ లేనికారణంగా గేదెలు, ఆవులు, మేకలు,కుక్కలు, కోతులు తరచూ హాస్టల్‌లోకి ప్రవేశిస్తుండటంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు.



కిటికీలు కూడా సరిగా లేకుండా ఉన్న హాస్టల్ గది

అందని మెస్‌చార్జీలు..

ఇక్కడ ఉంటున్న విద్యార్థినులకు మూడు నెలలుగా మెస్‌చార్జీలను ప్రభుత్వం మంజూరు చేయలేదు. దీంతో వార్డెన్ సొంతనిధులు వెచ్చించాల్సి వస్తోంది. కనీసం టాయిలెట్ల నిర్వహణకు కూడా ప్రభుత్వం డబ్బులు నిధులు మంజూరుచేయకపోవడం గమనార్హం.

వేధిస్తున్న అనేక సమస్యలు..

హాస్టల్‌లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. మున్సిపాలిటీ పైపులైన్ ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థినులు బోరునీటినే తాగాల్సిన పరిస్థితి. ఇక్కడ 20 స్నానాల గదులు, 20 టాయిలెట్లు ఉండగా ముప్పావుశాతం గదులకు తలుపులు లేవు. మిగిలినవి కూడా శిథిలావస్థలో ఉన్నాయి. విద్యార్థినులు ఉండే గదుల్లో కొన్నింటికీ తలుపులు లేవు. ఆయా భవనాల్లోని 25 కిటికీల తలుపులు సైతం ఊడిపోయి ఉన్నాయి. సోలార్ సిస్టమ్ పనిచేయకపోవడంతో రాత్రివేళల్లో విద్యుత్ నిలిచిపోతే విద్యార్థినులు భయాందోళనలకు గురవుతున్నారు. హాస్టల్‌కు త్రీఫేజ్ విద్యుత్‌కు బదులుగా సింగిల్ ఫేజ్ విద్యుత్‌మాత్రమే సరఫరా అవుతుండటంతో తరచూ వైర్లు కాలిపోతున్నాయి. బాలికలకు సంబంధించి నెలసరి ప్యాడ్‌లు కాల్చివేసేందుకు వినియోగించే మిషన్ కూడా పనిచేయడం లేదు. ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిధి, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు స్పందించి హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

రక్షణ లేకుండాపోయింది



హాస్టల్ భవనం చుట్టూత ప్రహరీ లేకపోవడంతో పిల్లలను చేర్పించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే తదితర ప్రజాప్రతినిధులు ఈ హాస్టల్‌ను పరిశీలించి ఇక్కడ నెలకొన్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలి.

– మేరుగు ఆదాం, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు, బలుసుపాడు.

బిల్లుల రాక ఇబ్బందులు..

నాలుగు నెలలుగా డైట్‌చార్జీలు అందకపోవడంతో అప్పులు చేసి హాస్టల్‌ను నడిపించాల్సి వస్తోంది. హాస్టల్ ప్రహరీ నిర్మాణం కోసం ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు అందజేశాం. మంచినీటి పైపులైన్ వేయాలని మున్సిపల్ అధికారులను కోరాం.

– సుల్తానా, హాస్టల్ వార్డెన్

గ్రామసభల నిర్వహణ



జగ్గయ్యపేట:మండలంలోని జయంతిపురం, బండిపాలెం, అనుమంచిపల్లి గ్రామాల్లో ఆదివారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ పున్నమినాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో 2023–24కు సంబంధించి ఉపాధి హామీ పనులు, కూలీల వేతనాలు. చేసిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో డీఆర్పీలు చంద్రరావు, శ్రీను, ఈసీ సంతోష్, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం పదిగంటలకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వీ జాహ్నవి ఆదివారం తెలిపారు. ఆయా సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చని సూచించారు.

నేటినుంచి శిక్షణా తరగతులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట):గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమ, మంగళవారాల్లో మండలంలోని అన్ని గ్రామాల ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నితిన్ ఆదివారం తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. ఈ శిక్షణలో పంచాయతీ రాజ్ నిబంధనలతో పాటు 10 అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తప్పకుండా పాల్గొనాలని కోరారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు



పేట తోటబజారు మండపంలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



అంబారుపేటలో అన్నపూర్ణాదేవి అలంకారంలో సత్యమ్మ అమ్మవారు



పెనుగంచిప్రోలు డౌన్‌సెంటర్లో అమ్మవారిని దర్శించుకున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), గ్రామస్తులు



లింగాలపాడులో లలితాత్రిపురసుందరీ అలంకారంలో అమ్మవారు



అల్లూరులో లలితాత్రిపుర సుందరీదేవి అలంకారంలో మహాలక్ష్మి అమ్మవారు

నందిగామ టౌన్: నందిగామ నియోజకవర్గంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తులు వైభవంగా నిర్వహిస్తున్నారు. నందిగామ మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారు ఆదివారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో హరిగోపీనాథ్ పర్యవేక్షణలో అర్చకులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలో వేంచేసియున్న కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞాన సరస్వతి అమ్మవార్లను లలితాత్రిపుర సుందరీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గోళ్లమూడి శంభులింగేశ్వరస్వామి, కూడలి సంగమేశ్వర స్వామి వారి ఆలయాలలోని పార్వతీ మాతకు విశేష పూజలు చేశారు. నందిగామలోని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో శుకశ్యామలాంబ అమ్మవారు వాసవీ కన్యకా పరమేశ్వరీ, మరిడీ మహాలక్ష్మి అమ్మవారు లలితాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. లింగాలపాడులో లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారిని అర్చకులు లలితాత్రిపురసుందరీ దేవిగా అలంకరించి పూజలు చేశారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు:దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం పెనుగంచిప్రోలు తూర్పుబజారులో శ్రీదుర్గామల్లేశ్వరి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా కుంకుమార్చన నిర్వహించారు. డౌన్ సెంటర్‌లోని ఎస్సీకాలనీలో ఏర్పాటు చేసిన అమ్మవారిని స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు. శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయం, నవాబుపేట, ముండ్లపాడు గ్రామాల్లో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో...

జగ్గయ్యపేట: వేదాద్రి, ముక్త్యాల, చిల్లకల్లు గ్రామాలలోని ప్రత్యేక మండపాలలో ఏర్పాటు చేసిన అమ్మవారిని అర్చకులు లలితాత్రిపురసుందరీ దేవిగా అలంకరించి అలంకరణ విశిష్టతను భక్తులకు వివరించారు. పలు గ్రామాలలో అమ్మవారి మంటపాల వద్ద మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని మార్కండేయ స్వామి బజార్‌లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

జగ్గయ్యపేట పట్టణంలో...


జగ్గయ్యపేట అర్బన్: స్థానిక నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో శ్రీచండీ మూలమంత్రసహిత రుద్రహోమం నిర్వహించారు. అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో గోపూజ, కుంకుమార్చన చేశారు. దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో శ్రీలలితాత్రిపుర సుందరీదేవిగా, అద్దాలబజారులోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీకాత్యాయినీదేవిగా, తోటబజారులోని యూత్ ఆధ్వర్యంలో, మార్కండేయబజారులో ఏర్పాటుచేసిన మండపాల్లో అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లోని నాగసత్యమ్మ ఆలయంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరణ చేశారు. వీఎస్పీ ఉద్యోగ ప్రముఖులు హేమనాయక్ దంపతులు పాల్గొని పూజలు చేశారు. జేఎల్ఎం ఇన్‌చార్జ్ నాగరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని అల్లూరులో వేంచేసియున్న సీతారామచంద్ర సహిత మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో వేంచేసియున్న అమ్మవారిని ఆదివారం లలితాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి విశేష పూజలు చేశారు. వెల్లంకిలో ఏర్పాటు చేసిన అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

వత్సవాయి మండలంలో...

వత్సవాయి:దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం అమ్మవారు బాలా త్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను బాలాత్రిపురసుందరిగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం సమయాల్లో మహిళలు విగ్రహాల వద్ద రంగురంగు పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఒకచోట పేర్చి మహిళలంతా ఆడిపాడారు.



కంచికచర్లలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



ముక్త్యాలలో లలితాత్రిపురసుందరీ అలంకారంలో భవానీ అమ్మవారు



వేదాద్రిలో మండపంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ అమ్మవారు



పేట నకాశిబజారులో ప్రత్యేకాలంకరణలో శ్రీకనకదుర్గ అమ్మవారు



మంగొల్లు శివాలయం వద్ద బాలాత్రిపురసుందరిగా అమ్మవారు



స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లో కరెన్సీ నోట్ల అలంకరణలో అమ్మవారు

కనులపండువగా బతుకమ్మ సంబరాలు

పెనుగంచిప్రోలు:మండలంలో బతుకమ్మ సంబరాలు వైభవంగా సాగుతున్నాయి.పెనుగంచిప్రోలు శ్రీధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం, లింగగూడెం, ముండ్లపాడు, ముచ్చింతాల గ్రామాల్లో ఆదివారం రాత్రి బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయాలను గౌరవిస్తూ బతుకమ్మ సంబరాల్లో భాగంగా మహిళలు రంగురంగుల పూలు, ఆకులతో బతుకమ్మలను తయారు చేసి ఆడిపాడారు. మునేరులో నిమజ్జనం చేశారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్:దసరా పండుగ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలు ఆదివారం రాత్రి స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో తయారుచేసిన బతుకమ్మలతో మహిళలు, బతుకమ్మ కమిటీ సభ్యులు పూజలు చేశారు. బతుకమ్మ గేయాలు ఆలపించారు. కోలాట ప్రదర్శన అందరినీ అలరించింది. బతుకమ్మ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అనంతరాజా, తులసి సుబ్బారావు, యర్రా శ్రీనివాసరావు, నోముల శివకుమార్, చక్కా సుధాకర్, కేతవరపు వెంకట్ పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు



పేటలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మహిళలు, బతుకమ్మ అభివృద్ధి కమిటీ సభ్యులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కన్నెవీడు(వత్సవాయి):మండలంలోని కన్నెవీడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పాఠశాలలో 1980నుంచి 85 చదువుకున్న పూర్వవిద్యార్థులందరూ కలుసుకున్నారు. పూర్వ విద్యార్థులంతా కలిసి అప్పటి ఉపాధ్యాయులు నాంచారయ్య, రామకృష్ణలను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ చావా దుర్గారాణి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థులు కృషి చేయాలని కోరగా, అందుకు తమ వంతుగా సాయం అందిస్తామని వారు హామీ ఇచ్చారు.కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కర్నాటి అప్పారావు, చావా శ్రీధర్, కర్నాటి రఘు తదితరులు పాల్గొన్నారు.